# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలు, యువత, పేదలు, రైతులు అభ్యున్నతితోనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ❖ అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC) లను ప్రోత్సహిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- ❖ ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ పరిశుభ్రతను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేసుకోవాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు కోరారు.

==============================

మహిళలు, యువత, పేదలు, రైతుల అభ్యున్నతితోనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధానమంత్రి `స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్`తో పాటు 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోని 140 కోట్ల మంది భారతీయులు అభివృద్ధి పథంలో సాగలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. స్వస్థ నారి - సశక్త్ పరివార్ అభియాన్ కింద నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను మహిళలు ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి కోరారు. భారతీయులు స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీన నిజాం పాలన నుంచి హైదరాబాద్‌కు విమోచనం కలిగిందని ఆయన గుర్తు చేశారు. దేశ ఐక్యత కోసం సైనికులు అనేక త్యాగాలు చేశారని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC)లను ప్రోత్సహిస్తామని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. విశాఖపట్నంలో ఈ రోజు జరిగిన సీఐఐ - గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

బిజినెస్ సమ్మిట్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐఐ నివేదికను విడుదల చేశారు. అనంతరం నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... GCCల ఏర్పాటు విషయంలో వివిధ రాష్ట్రాలకు కేంద్రం మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఆయా రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించడానికి అవసరమైన విధంగా దిశా నిర్దేశం చేస్తుందని తెలిపారు. సమగ్ర ప్రాంతీయ అభివృద్ధితో పాటూ.. ఉపాధి అవకాశాలను పెంచడం నూతన ఆవిష్కరణాలకు ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. ఈ ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో కలిసి ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉందని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================

ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. తన స్వీయ రక్షణ కోసం భారతదేశం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భారత్ జోలికి వస్తే ఏమి జరుగుతుందన్నది ఆపరేషన్ సింధూర్‌తో చూపించామని ఆయన గుర్తు చేశారు. దేశ రక్షణ విషయంలో ఎవరికీ భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ రోజు నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలలో రాజ్ నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందిన సమయంలో వివిధ రాజ్యాలు ఉండేవన్నారు. దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అఖండ భారత్ ఐక్యత కోసం ప్రయత్నం చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో నాలుగవ స్థానంలో నిలిచిందని, త్వరలోనే మూడో స్థానంలోకి చేరుకుంటుందని రక్షణ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

==============================

పరిశుభ్రతను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేసుకోవాలని కేంద్ర మైనారిటీ సంక్షేమం, పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు కోరారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు నుండి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు కొనసాగే “స్వచ్ఛతా హి సేవా” ప్రచారం 2025ను నిర్వహించింది. ఈ ప్రచారాన్ని ఢిల్లీలోని గురుద్వారా బంగ్లా సాహిబ్ సమీపంలో కేంద్రమంత్రి ప్రారంభించి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పరిసరాలతో పాటు దేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించినప్పటి నుండి ప్రజల్లో పరిశుభ్రత గురించి అవగాహన ఏర్పడిందన్నారు. దానిని మరింతగా కొనసాగించాలని అభిప్రాయపడ్డారు.

విరామం

==============================

న్యూఢిల్లీలో జరుగుతున్న సేవా పఖ్వాడాలో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు ఢిల్లీలో 1,600 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక త్యాగరాజ్ స్టేడియంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 11 సంవత్సరాలుగా దేశం సురక్షితంగా ఉందని చెప్పారు. అదేవిధంగా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయిందని, అభివృద్ధి పేదలకు చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 60 కోట్ల మందికి మౌలిక సౌకర్యాలు కల్పించిందని, 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకి తీసుకుని వచ్చిందని అమిత్ షా వివరించారు.

==============================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం

ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రస్తానంపై పలు రంగాలకు చెందిన ప్రముఖుల స్పందనను ఇప్పుడు తెలుసుకుందాం.

(వాయిస్ 90 సెకన్లు)

==============================

చండీగఢ్ లోని ముల్లాన్‌పూర్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్లు జరుగుతున్న రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్ లో తొలుత టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఆస్ట్రేలియాకు 292 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా 40 ఓవర్లకుకి 9 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,380 పాయింట్ల లాభాల్లో ప్రారంభమై... చివరికి 313 పాయింట్ల లాభంతో 82,693 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91 పాయింట్లతో 25,330 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.84గా ఉంది.

==============================

భారత వాతావరణ శాఖ (IMD) రానున్న ఐదు రోజుల్లో తూర్పు భారతదేశం తూర్పు ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. వాతావరణ అధికారి శశికాంత్ మిశ్రా ఆ వివరాలను తెలియచేస్తూ.. రాబోయే ఐదు రోజుల పాటు కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమలో బలమైన ఉపరితల గాలులు కూడా వీచే అవకాశం ఉందని చెప్పారు. అలాగే బీహార్ ఉత్తరాఖండ్ ఉత్తర ప్రదేశ్ లలో భారీ వర్షాలు రానున్న మూడు రోజుల పాటు కూరుస్తాయని వెల్లడించారు.

==============================
==============================